సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



పాడి రైతుల్లో ఆనందం..!

జగనన్న పాలవెల్లువ పథకంలో భాగస్వాములైన 4037 మంది రైతులకు అమూల్ సహకార సంఘం నగదు ప్రోత్సాహకాన్ని అందజేసిందని జిల్లా కలెక్టర్ గిరీషా తెలిపారు. -IIలో



గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తాం

మంగంపేట అగ్రహారం గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తామని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. -IIIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 305 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	505	505
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 190.740 కిలోలు

న్యూస్‌రీల్

ఇంటర్ ఫీజు గడువు పెంపు

రాయచోటి: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించే గడువును పొడిగించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య శనివారం తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ఫీజు గడువును నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించారన్నారు. జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశముందన్నారు.

26 నుంచి డీఆర్‌పీలకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)లో భాగంగా డిస్ట్రిక్ లెవెల్ రీసోర్సు పర్సన్(డీఆర్‌పీ)లకు అక్టోబర్ 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విజయవాడ జయప్రకాష్ నగర్‌లోని ఆంధ్ర లయోలా క్యాంపస్‌లో శిక్షణ ఉంటుందని వైఎస్సార్ జిల్లా డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు డీఆర్‌పీలుగా ఉన్న ఉపాధ్యాయులను 25వ తేదీన రిలీవ్ చేసి శిక్షణకు పంపాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు.

లోక్ అదాలత్‌లో 27 కేసులు పరిష్కారం

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 27 కేసులను పరిష్కరించారు. బాధితులకు రూ. 1,63,19000 నగదును అందేలా చేశారు.

27న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరువన్నామలైకి జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఎనిమిది ప్రత్యేక సర్వీసులను నడపనున్నామని వైఎస్సార్ జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప నుంచి రాత్రి 9 గంటలకు, జమ్మలమడుగు నుంచి ఉదయం 7 గంటలకు, మైదుకూరు నుంచి ఉదయం 7.00, సాయంత్రం 6.00 గంటలకు, పోరుమామిళ్ల నుంచి ఉదయం 5.30, 6.00 గంటలకు, పులివెందుల నుంచి రాత్రి 8.00 గంటలకు, ప్రొద్దుటూరు నుంచి రాత్రి 9.00 గంటలకు, బద్వేలు నుంచి ఉదయం 6.00 గంటలకు సర్వీసులు నడుస్తాయన్నారు. ఆయా బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు గిరి ప్రదక్షిణకు రాను, పోను తమ టిక్కెట్లను రిజర్వు చేసుకోవాలని కోరారు.

ఈ-బస్సులకు కొత్త స్టాపింగ్‌లు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–తిరుపతి మధ్య నడుస్తున్న ఎలక్ట్రికల్ బస్సులకు కొత్తగా రాజంపేట, రైల్వేకోడూరులలో స్టాపింగ్‌లు కల్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఈ బస్సులలో కడప నుంచి రాజంపేటకు రూ.120, కడప నుంచి రైల్వేకోడూరుకు రూ.190లు, కడప నుంచి తిరుపతికి రూ. 300లుగా చార్జి నిర్ణయించారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని ఇస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.2,00116లు విరాళంగా అందాయి. తొండూరుకు చెందిన అడికే రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగేశ్వరరెడ్డి(డీఆర్ డీఎల్ శాస్త్రవేత్త), కోడలు మంజుల, మనుమడు ప్రణీత్ కుమార్ రెడ్డిలు ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా వారు సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కాగా, ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్‌లు దాతలచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం అందజేశారు.

సామర్థ్యాల మదింపు..
ప్రతిభ గుర్తింపు

- 3,6,9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య నిర్ధారణ పరీక్ష
- నవంబర్ 3న పాఠశాలల్లో సర్వే



పరీక్షకు సన్నద్ధం అవుతున్న జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు (ఫైల్)

మదనపల్లె సిటీ: విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టాయి. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను తరగతి వారీగా మదింపు చేసే ప్రక్రియ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్–నాస్)ను వచ్చే నెల 3 వతేదీ నుంచి నిర్వహించనున్నారు. ప్రతి మూడేళ్లకోసారి నాస్ సర్వే నిర్వహిస్తారు. చివరగా 2021లో జరిగింది. తాజాగా 2024లో జరిపేందుకు రంగం సిద్ధం చేశాయి. దీని ఆధారంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసి, విద్యా ప్రణాళికలు అమలు చేస్తాయి. నాస్ సర్వేకు ముందు స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేను మండల స్థాయిలో చేపట్టనున్నాయి.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపిక

స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్)లో భాగంగా క్షేత్ర స్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు ఆయా మండలాలకు ఎంత మంది ఎఫ్‌ఐలు అవసరమనేది జిల్లా విద్యాశాఖ నిర్ధారణకు వచ్చింది. ఎఫ్ఏఐలు ఛాత్రోపాధ్యాయులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులను నియమించి శిక్షణ ఇవ్వనుంది. సర్వే పరీక్ష వీరి పర్యవేక్షణలోనే జరుగుతుంది. జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జరగనున్న పరీక్షలను డీసీఈబీ సెక్రటరీ, లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా మండల విద్యాశాఖాధికారులు 1,2 లతో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు. ముందుగా విద్యార్థులకు ఎస్సీఆర్టీ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంది. గతంలో నిర్వహించిన సర్వేలో భాగంగా మూడు,ఐదు, ఎనిమిది తరగతులకు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది సీస్ సర్వేలో 3,6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరపనున్నారు. ఎస్ఈఆర్‌టీ నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ ముందుగా సరఫరా చేసిన ప్రాక్టీస్ పేపర్లతో తర్ఫీదు ఇస్తారు. పూర్తిగా ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం, సోషియల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో..

ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో సర్వే నిర్వహిస్తారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్ష జరుగుతుంది. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సంబంధదించిన సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సంబంధించిన సిలబస్, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషియల్, సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు. 3,6 తరగతుల వారికి 40 ప్రశ్నలకు 60 నిమిషాల సమయం, 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. జిల్లాలో 1182 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్‌కమ్స్) ఆధారంగా సామర్థ్యాలు మదింపు చేయనున్నారు. ప్రతి శనివారం అన్ని యాజమాన్య పాఠాశాలల్లో ప్రత్యేక ప్రాక్టీస్ పరీక్షలు చేపట్టి విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో సాధన సర్వే ఇలా...

మండలం	స్కూల్స్	ఇన్వెస్టిగేటర్లు	బ్లాక్ కో-ఆర్డినేటర్లు
బి.కొత్తకోట	42	46	2
చిన్నమండ్యం	27	30	1
చిట్వేలి	36	40	2
గాలివీడు	41	45	2
గుర్రంకొండ	34	37	2
కె.వి.పల్లి	31	34	2
కలకడ	29	32	1
కలికిరి	40	44	2
కోడూరు	54	59	3
కురబలకోట	35	39	2
లక్కిరెడ్డిపల్లె	33	36	2
మదనపల్లె	81	89	4
ములకలచెరువు	41	45	2
నందలూరు	39	43	2
నిమ్మనపల్లె	26	29	1
ఓబులవారిపల్లె	45	50	2
పెద్దమండ్యం	29	32	1
పిటీఎం	23	25	1
పెనగలూరు	40	44	2
పీలేరు	55	61	3
పుల్లంపేట	43	47	2
రాజంపేట	61	67	3
రామాపురం	46	51	2
రామసముద్రం	32	35	2
రాయచోటి	65	72	3
సంబేపల్లి	26	29	1
టి.సుండుపల్లి	39	43	2
తంబళ్లపల్లె	25	28	1
వాల్మీకిపురం	35	39	2
వీరబల్లి	29	32	1

సామర్థ్యం అంచనా



సీస్ సర్వే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల అంచనా వేసేందుకు ఉపకరిస్తుంది. ఫలితాలను బట్టి తగిన బోధనా ప్రణాళికలను రూపొందించేందుకు వీలవుతుంది.
– అనదుల్లాషా, లెక్చరర్, డైట్, రాయచోటి

విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యం



నాసా సర్వేతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపు జరుగుతుంది. సర్వేను జిల్లా కమిటీ పర్యవేక్షిస్తుంది. విద్యార్థులకు నిర్వహించే పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యంగా సాగుతున్నాం. –శ్రీరాం పురుషోత్తం, డీఈఓ

సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి



ఆర్బీకే సిబ్బందిని వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా

రామాపురం: రైతుభరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని నల్లగుట్టపల్లె ఆర్‌బీకేను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌బీకేల పరిధిలో సాగయ్యే విస్తీర్ణానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నల్లగుట్టపల్లె ఆర్‌బీకేలోని కియోస్కి మెషీన్, మాయిశ్చర్ మీటర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రత్నకుమారికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్‌గా డాక్టర్ రత్నకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఏలూరు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేశారు. పదోన్నతి లభించడంతో ఇక్కడ ప్రాంతీయ సంచాలకులుగా విధులను చేపట్టారు. అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్)గా పనిచేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్ ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. తాజాగా ఈ స్థానంలోకి రత్నకుమారి వచ్చారు.ఆమెకు కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ అలావుల్లా, బత్తనయ్య, వినీష అభినందనలు తెలిపారు.

అమరవీరుల త్యాగాలను మరువలేం



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ కృష్ణారావు, పోలీసు అధికారులు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం జిల్లా పరేడ్ మైదానంలో కలెక్టర్ గిరీషా పీఎస్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరులైన పోలీసు వీరులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ కృష్ణారావులు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్ ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దుల్లో కాపలాగా ఉన్న పది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు అర్పించారని, వారి ధైర్యాన్ని, త్యాగాన్ని స్మరించుకోవడానికి అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని పోలీసుశాఖ శాంతి భద్రతల పరిరక్షణలో, చట్టాలను పరిరక్షించుకోవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో మాత్రమే కాకుండా రాత్రిపూట పెట్రోలింగ్, ట్రాఫిక్‌ను నియంత్రించడం, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలలో ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. వారి కుటుంబాలకు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు.

- జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగనిరతికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదిన పోలీసు అమరవీరుల దినంగా పరిగణిస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో పోలీసుల వీరమరణాల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే ఉందని, అయినప్పటికీ పోలీసులు ధైర్యంతో ముందుకు దూసుకుపోతూనే ఉన్నారన్నారు.అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పుడు జిల్లా పోలీసు కార్యాలయం చుట్టూ రాళ్లు, గుట్టలు ఉండి చిన్న అడవిలాగా ఉండేదని, కానీ హోంగార్డు నుంచి పై అధికారుల వరకు కష్టపడి పనిచేసి, శ్రమదానం చేసి అందంగా తీర్చిదిద్దారని, మన కష్టానికి తోడుగా జిల్లా కలెక్టర్ సహకారంతో పోలీస్ గ్రౌండ్ సుందరంగా తయారైందన్నారు. జిల్లాకు చెందిన చాలా మంది ఆర్మీ, పోలీస్, ఇతర రక్షణ విభాగాలలో ఉన్నారన్నారు.సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసులందరికీ జోహార్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజకమల్ పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

విధి నిర్వహణలో ఉంటూ ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు శాఖాపరంగా అండగా ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల సంస్మరణం సందర్భంగా మృతి చెందిన పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. వారికి రావాల్సిన ఏపీజీఎల్ఐ, కారుణ్య నియామకం, ప్రమాద భీమా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, తదితర బెనిఫిట్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలపై సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసుశాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం, పోలీసుశాఖ నుంచి రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వేజనా సుఖినోభవంతు

- లోక కల్యాణం కోసం వేద పారాయణం
- దసరా మహోత్సవాలకు తరలివచ్చిన వేదపండితులు



అమ్మవారిశాలలో శ్రీ చక్రానికి అభిషేకం చేస్తున్న పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్: పండుగల సందర్భంలో ఇంట్లో కానీ, ఆలయాల్లో కానీ వేద మంత్రాలతో పూజలు నిర్వహించడం చూస్తుంటాం. అయితే పది రోజుల పాటు జరిగే దసరా పండుగలో అమ్మవారిని స్తుతిస్తూ నాలుగు వేదాల్లోని మంత్రాలు, జప హోమాలు వేదపండితులు నిర్వహిస్తుంటే మనసు పులకరించి భక్తిభావం పెరుగుతుంది. చతుర్వేద పారాయణం, జప హోమాదులు జరపడం ద్వారా అందరికీ మంచి జరిగి సమస్త జీవరాశులు సుఖసంతోషాలతో జీవిస్తారని ప్రతీతి. దసరా ఉత్సవాలను నిర్వహించడంలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించిన ప్రొద్దుటూరు పట్టణంలో దేవీనవరాత్రుల సందర్భంగా వివిధ ఆలయాల్లో వేదపారాయణం, హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించేందుకు రాష్ట్రంతోపాటు రాజస్థాన్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వేదపండితులు పట్టణానికి చేరుకున్నారు. వీరి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఒక్కో ఆలయంలో 5 నుంచి 19 మంది వేదపండితులు పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిశాలలో ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వణ వేదాలతోపాటు రామాయణ, మహాభారతం, భాగవత పారాయణం, శతచండీయాగాలను వీరు నిర్వహిస్తున్నారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన పాంచరాత్రాగమ పండిత్ శ్రీనాథాచార్యులు ఏడుగురు శిష్యబృందం ఆధ్వర్యంలో రోజూ ఆగమశాస్త్రం ప్రకారం పూజలు చేస్తున్నారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది వేద పండితులు పూజలు నిర్వహిస్తున్నారు.

లోక కల్యాణం కోసమే..

రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 19 మంది వేద పండితులతో నవరాత్రుల సందర్భంగా హోమాలు, జపాలు, చతుర్వేద పారాయణలను చేస్తున్నాం. తోగడ్డేటి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. 18 ఏళ్లుగా దసరా వేడుకలకు సంబంధించిన పూజల్లో పాల్గొంటున్నాను. లోక కల్యాణం కోసమే వేదపారాయణం నిర్వహిస్తున్నాం.
– వెల్లాల వెంకట శేషయ్యశర్మ, ఆళ్లగడ్డ

స్వామి,అమ్మవార్లకు అందాలు అద్దుతూ...!

మదనపల్లె సిటీ: దేవుడి ఉత్సవం కానీ, ఊరేగింపు గానీ వైభవంగా జరగాలంటే ఉత్సవ మూర్తుల అలంకరణకు ప్రాధాన్యం ఉంటుంది. పట్టువస్త్రాలు, కిరీటాలు, ఆభరణాలు, పుష్పమాలికలతో చేసే అలంకారం వల్లనే దేవతామూర్తుల సౌందర్యం ద్విగుణీకృతమవుతుంది. అయితే ఈ అలంకరణ అందరికీ సాధ్యం కాదు. దేవస్థానాల్లో పూజలు చేసే ఆగమం ప్రకారమే చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా దేవతామూర్తులను అందంగా అలంకరించడంలో సిద్ధహస్తుడు మదనపల్లెలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ. ప్రతి ఏడాది నిర్వహించే దసరా ఉత్సవాలకు శ్రీలలిత.. త్రిపుర సుందరిదేవి అమ్మవార్ల అలంకణలు విభిన్న రూపాల్లో పది రోజుల పాటు చేస్తారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో జరిగే ఉత్సవాలకు వెళ్లి ప్రత్యేకంగా అలంకరణ చేస్తున్నారు. కళ్యాణోత్సవాలకు దేవతా విగ్రహాలనుఅందంగా అలంకరించి, ప్రశంసలు పొందుతున్నారు.

అలంకరణకు 5 గంటలు

దసరా ఉత్సవాల్లో అమ్మవారి ప్రత్యేక అలంకరణలకు సుమారు అయిదు గంటలు పడుతుంది. ఇందు కోసం అలంకణ వస్తువులు కుంభకోణం, బెంగుళూరు ప్రాంతాల నుంచి తెచ్చుకుంటారు. వివిధ రకాల పూలను హారాలు ఇక్కడే కట్టిస్తారు.



అమ్మవారికి అలంకరణ చేస్తున్న అర్చకులు ఫణికుమార్‌శర్మ (ఇన్‌సెట్) ఫణికుమార్‌శర్మ (ఫైల్)



పాడి రైతుల్లో ఆనందం..!

- అన్నమయ్య జిల్లాలో 4037 మంది రైతులకు రూ.65 లక్షల లబ్ధి
- నగదు ప్రోత్సాహకాన్ని రైతుల అకౌంట్లకు బదిలీ చేసిన అమూల్ సహకార సంఘం

రాయచోటి : జగనన్న పాలవెల్లువ పథకంలో భాగస్వాములైన 4037 మంది రైతులకు అమూల్ సహకార సంఘం నగదు ప్రోత్సాహకాన్ని అందజేసిందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ మేరకు అమూల్ సహకార సంఘం పాడి రైతుల బ్యాంకు అకౌంట్లలో ఒక లీటర్‌కు 50 పైసల వంతున నేరుగా విడుదల చేసినట్లు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తెలిపారు. సహకార రంగంలో పాల డైరీలను బలోపేతం చేసే లక్ష్యంతో అంతర్జాతీయంగా పేరు పొందిన అమూల్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో జగనన్న పాలవెల్లువ పథకానికి శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్న అర్హులైన రైతులకు అమూల్ సహకార సంఘం నగదు ప్రోత్సాహకాన్ని ఇచ్చిందన్నారు. అన్నమయ్య జిల్లాలో 4037 మంది అర్హత కలిగిన పాడి రైతులకు సుమారు రూ.65 లక్షలను కానుకగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నెల వరకు 182 రోజుల కంటే ఎక్కువ రోజులు పాలు



అమూల్ కేంద్రంలో రైతుల నుంచి పాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

పోసిన వారు ఇందుకు అర్హులన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా అమూల్ విడుదల చేసిన నగదు ప్రోత్సాహకం పొందిన రైతులందరికీ అభినందనలు తెలిపారు. జగనన్న పాలవెల్లువ పథకాన్ని రైతులందరూ వినియోగించుకొని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలన్నారు.

జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ పాడి పశువుల ద్వారా జీవనం సాగించే వారికి పశుకిసాన్ క్రెడిట్ కార్డుల సౌలభ్యం ఉందన్నారు. ఈ సౌలభ్యాన్ని రైతులు ఉపయోగించుకొని మరింత లబ్ధి పొందాలని సూచించారు.

ఆకర్షిస్తున్న ఆఫర్లు..!

కడప కల్చరల్ : ఆఫర్లే ఆఫర్లు....ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు, వస్త్రాలు, ఫర్నీచర్, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు ఇలా రోడ్ల కూడళ్లలో ఎక్కడ చూసినా ఆఫర్లే ఆఫర్లు. ప్రజలను ఆకర్శిస్తూ ఆఫర్ల భారీ హోర్డింగులు అడుగడుగునా చిన్నసైజు లైటింగ్ బోర్డులు, వీధుల్లో ఆటోల్లో ప్రచార హోరు, పత్రికలు, మీడియా ప్రసారాలలో కూడా ఆఫర్లే.

దసరా ధమాకా

దసరా పండగొచ్చిందంటే అందరికీ సంతోషమే. అందులోనూ పదిరోజుల పండుగ దసరా అంటే మరింత సంతోషం. సెలవులొచ్చాయని పిల్లలు సంబరపడితే, పండుగ సందర్భంగా కొత్త వాహనాలు తెచ్చుకుంటే మంచిదని, పండుగ సంతోషం మరింత ఇనుమడిస్తుందని పెద్దలు భావిస్తారు. ముఖ్యంగా దుస్తులు, వాహనాల కొనుగోళ్లు దసరా పండుగ సందర్భంగా జోరుగా సాగుతాయి. వస్త్ర వ్యాపారులు భారీ హోర్డింగులు ఏర్పాటు చేసి పలు రకాల ఆఫర్లను ప్రకటించారు. కొందరు దసరాతోపాటు వ్యాపారాలను మరో నెల రోజులు పొడిగించుకునేందుకు దసరా నుంచి దీపావళి వరకు దసరావళి పేరిట ఆఫర్లను కొనసాగిస్తూ బ్యానర్లు, బోర్డులను ఏర్పాటు చేశారు. వస్త్ర వ్యాపారాలతోపాటు ఫ్యాన్సీ, ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణదారులు కూడా పెద్ద ఎత్తున ఆఫర్లను ప్రకటించారు. ద్విచక్ర వాహనాల వ్యాపారులకు ఈ పండుగ ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ సందర్భంగా పలు ద్విచక్ర వాహన డీలర్లు రెండు, మూడు రోజులపాటు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ మేళాలు నిర్వహించనున్నారు. ద్విచక్ర వాహనం కొంటే సైకిళ్లు, టీవీలు, సెల్‌ఫోన్లు, మిక్సీలు, గోల్డ్ కాయిన్, సీడీ ప్లేయర్లు లాంటి పలు



ఆకర్శణీయమైన కానుకలు ఇవ్వనున్నట్లు భారీ హోర్డింగులు ఏర్పాటు చేసి ప్రజలను ఆకర్శిస్తున్నారు. ముఖ్యంగా విజయదశమి సందర్భంగా, తమ కొనుగోలు విజయవంతంగా సాగాలని కోరుకుంటూ పండుగ సంతోషం పెరిగేలా నూతన వాహనాన్ని కొనడం శుభదాయకమని ప్రజలు భావిస్తున్నారు. అందుకే విజయదశమి నాడు నూతన వాహనం ఇంటికి తెచ్చుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల కొనుగోళ్లే ప్రధానపాత్ర వహిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లోనూ అదేజోరు

స్థానిక దుకాణదారులే కాకుండా ఆన్‌లైన్ ద్వారా వ్యాపారం చేసే కంపెనీలు కూడా భారీగా డిస్కౌంట్లు ప్రకటించాయి. పండుగ స్పెషల్‌గా రెండు, మూడు ప్రముఖ ఆన్‌లైన్ కంపెనీలు 40 శాతం నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్ సేల్స్ ప్రకటించాయి. ప్రముఖ దినపత్రికల్లో ఫుల్ పేజీల ప్రకటనలు ఇవ్వడంతోపాటు టీవీల్లో కూడా భారీగా ప్రచారం చేస్తున్నాయి. ఒక్కో కంపెనీ వారు దాదాపు 40 నుంచి 60 రకాల వస్తువుల వరకు డిస్కౌంట్‌లో ఆఫర్లు ప్రకటించాయి. కొన్నిచోట్ల డెలివరీ సిబ్బంది కొరత కారణంగా వస్తువులు ఆలస్యమవుతాయని కంపెనీదారులు ముందే ప్రకటిస్తుండడం విశేషం.

ఆన్‌లైన్‌పై కొనుగోలు చేసే వారికి మొత్తం కొనుగోలు చేసే ధరను బట్టి పాయింట్లను కేటాయిస్తూ వాటిని ధరకు జమ కట్టి ఆ ధరకు కూడా వస్తువులను కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డుల కొనుగోళ్లపై కూడా పాయింట్లు కేటాయింపు, వారి ఆధారంగా మళ్లీ కొనుగోలు జరుగుతున్నాయి. మొత్తం దసరా పండుగ సందర్భంగా అతి తక్కువ ధరలో వస్తువులు పొందే అవకాశం ఉందంటూ ప్రజలు సంతోషిస్తుండగా, కేవలం పండుగ రోజుల్లోనే ఈ అవకాశం ఉన్నందున వ్యాపారులు ఉత్సాహంగా ఉన్నారు.

పోటాపోటీ ప్రచారం

ఎప్పటిలాగా ఆఫర్ల ప్రచారం కోసం వ్యాపారుల మధ్య భారీ పోటీ నెలకొంది. ముఖ్యంగా దినపత్రికల్లో రెండు, మూడు ఫుల్ పేజీల వ్యాపార ప్రకటనలు దసరా ప్రారంభం నుంచి వెలువడుతున్నాయి. దుకాణాల ముందు కూడా ప్రత్యేకంగా ఆర్చీలు ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుద్దీపాలు అలంకరించి ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ఉన్నట్లు ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేకంగా వాల్ పోస్టర్ల ద్వారా కూడా ప్రచారం చేసుకుంటున్నారు. దసరా, దీపావళి వ్యాపార ప్రకటనల కోసం కొందరు ప్రత్యేకంగా వాహనాలను ప్రకటనలకు అనుకూలంగా తయారు చేయించి ఆకర్శణీయంగా రూపుదిద్ది వీధుల్లో తిప్పుతున్నారు.

పోలీసు అమర వీరుల సేవలు మరువలేనివి

సిద్దవటం : దేశ సరిహద్దుల్లో విపరీతమైన చలి ఉన్నప్పటికీ దేశం కోసం, ప్రజల కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసువులు బాసిన పోలీసు అమర వీరుల సేవలు మరచి పోలేనివని బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు, సిద్దవటం కోర్టు జడ్జి శ్రీనివాసకళ్యాణ్ పేర్కొన్నారు. సిద్దవటం మండలం భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిద్దవటం కోర్టు జడ్జి, బెటాలియన్ కమాండెంట్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కమాండెంట్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో కొన్ని సందర్భాల్లో పోలీసులు తమ ప్రాణాలను సైతం కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమర వీరుల కుటుంబాలకు మెమెంటోలను జడ్జి శ్రీనివాసకళ్యాణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఏఓ గులామ్ దస్తగిరి, అసిస్టెంట్ కమాండెంట్ జయప్రసాద్‌రావు, శ్రీనివాసరావు, డీఎస్పీ/అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి, ఆర్‌ఐలు అలీ బాషా, కె.వి. రమణ, కె.వి. రంగారావు, సీఆర్‌కే రాజు, ఎం. ఆంజనేయులు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ద్విచక్రవాహనం, లారీ ఢీ

– వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి సదుం క్రాస్ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్రవాహనం, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న మండలంలోని కాట్నగల్లు పంచాయతీ కాకిమారుపల్లికి చెందిన వెంకటరమణ(38) తీవ్రంగా గాయపడి ఎడమ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తాం

ఏపీఎండీసీ ఎండీ వి.జి.వెంకటరెడ్డి

బులవారిపల్లె : మంగంపేట అగ్రహారం గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తామని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మంగంపేట ఏపీఎండీసీలో ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలుష్య గ్రామస్తులతో పునరావాసం తదితర అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీటీడీసీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఓరుగంటి నవీన్, తల్లెం రమణారెడ్డి పాల్గొన్నారు. సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గనులకు కూత వేటు దూరంలో ఉన్న అగ్రహారం గ్రామాన్ని తరలించాలని, మంగంపేట కాపుపల్లె, దళితవాడ గ్రామాలకు పరిహారం, పునరావాసం త్వరగా చేపట్టాలని, గోవిందంపల్లె చెరువులో డ్రైనేజీ నీరు కలుషితం తదితర సమస్యలను ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. చర్చలు సఫలం కావడంతో మంగంపేట అగ్రహారం గ్రామాన్ని ఈ నెలాఖరులోపు తరలిస్తామని ఎండీ వెంకటరెడ్డి గ్రామస్తులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. దాదాపు 45 కోట్ల రూపాయల ప్యాకేజీతో పాటు గతంలో కంటే వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

పది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఏపీఎండీసీ పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏపీఎండీసీ ఎండీ వి.జి. వెంకటరెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఏంపీఎండీసీ ఫౌండేషన్ ద్వారా 8 మంది విద్యార్థులకు మొత్తం 90 వేల రూపాయలు అందజేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎండీ వి.జి.వెంకటరెడ్డి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మంగంపేట ఏపీఎండీసీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎండీ వెంకటరెడ్డి అన్నారు. ఏపీఎండీసీ కార్యాలయంలో మంగంపేట ఏపీఎండీసీ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు ఎండీ స్పందిస్తూ నవంబర్ రెండవ తేదిన కార్మిక సంఘాల నాయకులు విజయవాడ కార్యాలయానికి రావాలని అక్కడ చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, తల్లెం రమణారెడ్డి, ఓరుగంటి అనిల్, జేసీఎస్ కన్వీనర్ అమరేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రాజు, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, వార్డు మెంబర్ జి.శారదమ్మ, మైనారిటీ నాయకులు షేక్ కరీముల్లా, పులగంటి శ్రీను, పులగంటి నరసింహులు, సీపీఐ నాయకులు పండుగోల్ల మణి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న చంద్రయ్య(48) కూలిపనులకు వెళుతూ జీవిస్తున్నాడు. శనివారం ఉపాధిలో భాగంగా చెట్టు ఎక్కిన చంద్రయ్య ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా, సత్యసాయిజిల్లా తనకల్లుకు చెందిన 108 వాహనం బాధితుడిని తీసుకుని మదనపల్లెకు బయలుదేరింది. మార్గమధ్యంలో మదనపల్లె శివారుప్రాంతం అమ్మచెరువుమిట్ట వద్ద 108 వాహనం సాంకేతిక లోపంతో నిలిచిపోవడంతో మదనపల్లె 108 వాహనానికి సమాచారం అందించారు. హుటాహుటిన 108 వాహనం అక్కడకు చేరుకుని బాధితుడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన స్థానిక వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


మృతి చెందిన రామచంద్ర

పీలేరురూరల్ : అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి పీలేరు మండలం ముడుప్పులవేముల పంచాయతీ వెంకటాద్రి ఇళ్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటాద్రి ఇళ్లకు చెందిన పూజారి రామచంద్ర (46) రెండు ఎకరాల పొలంలో టమాట సాగు చేశాడు. అలాగే వ్యవసాయ బోరు వేయించాడు. పంటసాగుకు, బోరుకు వడ్డీలకు సుమారు రూ. 9 లక్షలు అప్పు చేశాడు. టమాట సాగులో నష్టాలు రావడంతో అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శనివారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడి, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె పట్టణంలోని అబ్బయ్యగారివీధికి చెందిన పి.మహేష్(25) శనివారం ద్విచక్రవాహనంలో వెళుతుండగా, నారాయణ కళాశాల వద్ద టాటాఏస్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా చౌడేపల్లె మండలం సింగిరిగుంట పంచాయతీ పులికోనవంకకు చెందిన వెంకటరమణయ్య కుమారుడు కె.రవి(50) ద్విచక్రవాహనంలో వస్తుండగా, కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా శుక్రవారం రాత్రి నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన కె.రంజిత్(25), కె.విజయకుమార్(19) ద్విచక్రవాహనంలో వెళుతూ.. మార్గమధ్యంలోని యర్రాతివారిపల్లె వద్ద వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రవి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెకు చెందిన పవన్ భార్య ప్రవీణ(18) కుటుంబ సమస్యలతో విషపూరితమైన ఆకు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదేవిధంగా పీటీఎం మండలం పులికల్లుకు చెందిన శేఖర్ భార్య కె.శాంతమ్మ(40) కుటుంబ సమస్యలతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నిస్‌బాల్ పోటీల్లో కడపకు మూడోస్థానం

– పలువురు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్ : ఇటీవల గుంటూరు జిల్లా పేరిచర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టుకు మూడోస్థానం లభించింది. జట్టులో చక్కటి ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేసినట్లు ఏపీ టెన్నిస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రొద్దుటూరు పూజ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒంటేరు వీక్షిత్‌రెడ్డి, ప్రతీష్‌రెడ్డి, ఖాజీపేట బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలకు చెందిన అబ్దుల్ రెహమాన్, జగదీష్, కౌశిక్, యోగానంద, కౌషిక్, సాత్విక్, చాణిక్య, మనీష్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు డిసెంబర్‌లో కొడైకెనాల్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

కళ తప్పిన పసిడిపురి..!


ప్రొద్దుటూరులో మూత పడిన బంగారు దుకాణాలు


బోసిపోయిన బంగారు దుకాణాలున్న మెయిన్‌బజార్

- వెంటాడుతున్న ఐటీ దాడుల భయం
- ప్రొద్దుటూరులో బంగారు దుకాణాల మూసివేత
- పెళ్లిళ్ల సీజన్ వేళ.. తులం బంగారు కూడా మార్కెట్లో దొరకని పరిస్థితి
- మూడో రోజు కొనసాగుతున్న ఇన్‌కంట్యాక్స్ సోదాలు
- బడా బంగారు దుకాణాల వివరాలను సేకరిస్తున్న ఐటీ అధికారులు?

ప్రొద్దుటూరు క్రైం : స్వచ్ఛమైన బంగారుకు ప్రొద్దుటూరు ప్రసిద్ధి. ఎక్కడ బంగారు దొరక్కపోయినా ప్రొద్దుటూరులో మాత్రం కొదవ ఉండదు. కిలోల లెక్కన ఎంత బంగారు కావాలన్నా నిమిషాల్లోనే దొరుకుతుంది. బంగారు వ్యాపారంలో రెండో ముంబైగా పేరు గాంచిన ప్రొద్దుటూరులో బంగారు కరువైంది. ఇప్పుడు గ్రాము బంగారు దొరకడం కూడా గగనమైంది. ఐటీ సోదాలతో బెంబేలెత్తిన వ్యాపారులు దుకాణాలను మూసేశారు. ప్రధాన బంగారు విక్రయ దుకాణాలు మూత పడటంతో వాటి అనుబంధంగా ఉన్న వేలాది వర్క్ షాపులను మూసేశారు. దీంతో పసిడిపురి వీధులు బోసిపోయాయి. ఎప్పుడూ కిటకిట లాడుతూ కనిపించే బంగారు దుకాణాల వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి.

పెళ్లిళ్ల సీజన్‌లో తులం బంగారు కూడా దొరకని పరిస్థితి

ప్రొద్దుటూరులో 1800 దాకా బంగారు దుకాణాలు ఉన్నాయి. మిగతా ప్రాంతాల కంటే ఇక్కడ స్వచ్ఛమైన బంగారు లభిస్తుండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు నుంచి బంగారు కొనుగోళ్ల నిమిత్తం వస్తుంటారు. దీంతో సీజన్‌తో సంబంధం లేకుండా ఇక్కడి దుకాణాలు నిత్యం కిటకిట లాడుతుంటాయి. పెద్ద ఎత్తున బంగారు వ్యాపారాలు జరగడంతో ప్రొద్దుటూరు రెండో ముంబైగా పేరు పొందింది. బంగారు విక్రయ దుకాణాలకు అనుబంధంగా పట్టణంలో సుమారు 5 వేల వరకు వర్క్ షాపులు ఉన్నాయి. ఇందులో పని చేస్తున్న స్వర్ణకారులందరూ బంగారు దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నారు. రోజు వ్యాపారాలు బాగానే ఉన్నా.. అక్షయతృతీయ, దసరా, దీపావళి పండుగలతో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో అయితే కొన్ని దుకాణాల్లో కూర్చోడానికి చోటు దొరకదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం దసరా, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారులు పెద్ద ఎత్తున రెడిమేడ్ ఆభరణాలను సిద్ధం చేసుకున్నారు. పెళ్లి ముహూర్తాలున్నందున స్వర్ణకారులు కూడా నెల రోజుల ముందు నుంచే ఆభరణాలు తయారు చేసేందుకు పెద్ద ఎత్తున ఆర్డర్లు తీసుకున్నారు. ఆర్డర్లు ఇచ్చిన వారు నగల కోసం వచ్చి దుకాణాలు మూత పడటంతో నిరాశతో తిరిగి వెళ్తున్నారు. ఇక్కడి మార్కెట్‌లో మూడు రోజుల నుంచి పలు దుకాణాల్లో ఆదాయపన్ను శాఖ అధికారులు సుదీర్ఘంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రొద్దుటూరులో ఐటీ సోదాలు జరగడం ఇది కొత్తేంకాదు. ఏడాదిలో నాలుగైదు సార్లు తనిఖీలు జరుగుతుంటాయి. కొన్ని గంటలు లేదా ఒక రోజులో తనిఖీలు చేసి ఐటీ అధికారులు వెళ్లిపోయేవారు. అయితే ప్రధాన బంగారు దుకాణాల్లో మూడు రోజులుగా జరిగే సెంట్రల్ ఐటీ సోదాలు ప్రొద్దుటూరు బులియన్ మార్కెట్‌ను కుదిపేసిందని చెప్పొచ్చు. ఐటీ దాడుల సెగ తమకు ఎక్కడ అంటుకుంటుందో అన్న భయంతో 90 శాతంపైగా దుకాణాలు మూత పడ్డాయి. దీంతో తులం బంగారు కూడా ఎక్కడా దొరకని పరిస్థితి ఏర్పడింది. బంగారు ఆభరణాల కోసం దూరప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారు. దుకాణాలు మూత పడటంతో పట్టణంలో వేలాదిగా ఉన్న వర్క్ షాపుల సముదాయాలు, పెద్ద పెద్ద కాంప్లెక్స్‌లన్నీ మూసేశారు. ఈ సీజన్‌పై ఎంతో ఆశలు పెట్టుకున్న తమకు తీవ్ర నష్టం వచ్చిందని స్వర్ణకారులు వాపోతున్నారు. షాపులు మూత పడటంతో ఎప్పుడూ రద్దీగా ఉండే వీధులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి.

మూడో రోజు కూడా కొనసాగుతున్న తనిఖీలు

ఈ నెల 19న మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన సెంట్రల్ ఐటీ సోదాలు శనివారం కూడా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నాలుగు షాపుల్లో అధికారులు తనిఖీలు చేశారు. ఆదివారం కూడా సోదాలు జరిగే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. కాగా మూడు రోజుల నుంచి దుకాణాల యజమానులు, వారి కుటుంబ సభ్యులు, గుమాస్తాలు ఇళ్లలోనే ఉండిపోయారు. వారి సెల్‌ఫోన్లు కూడా పని చేయలేదు. దీంతో తనిఖీలు జరుగుతున్న దుకాణాల్లో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. బిల్లులు లేని, పన్ను చెల్లించని బంగారును పెద్ద మొత్తంలో గుర్తించినట్లు మార్కెట్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా ఐటీ అధికారులు స్వయంగా ప్రకటన విడుదల చేస్తేగానీ తనిఖీలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

బడా దుకాణాలపై ఐటీ కన్ను

ప్రొద్దుటూరులో పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించే దుకాణాలపై ఐటీ అధికారులు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మూడు రోజుల నుంచి నాలుగు దుకాణాల్లో ఐటీ దాడులు జరుగుతున్నాయి. వీటిలో సోదాలు చేసి ఆదాయపన్ను శాఖ అధికారులు వెళ్తారని అందరూ భావించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వివిధ హోదాల్లో ఉన్న 40 మందికి పైగా ఐటీ అధికారులు సాయుధ దళాలతో కలిసి ప్రొద్దుటూరుకు వచ్చారు. వీరిలో కొందరు అధికారులు రెండు, మూడు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని పలు బడా దుకాణాలను పరిశీలించారు. ఈ పరిశీలన రెండు రోజుల నుంచి కొనసాగుతుండటంతో మిగతా వ్యాపారుల్లో గుబులు నెలకొంది. దీంతో పెద్ద షాపులతో పాటు చిన్నాచితక దుకాణాలన్నీ మూత పడ్డాయి. కొందరు వ్యాపారులు నమ్మకస్తులైన వర్క్ షాపుల్లో బంగారు నిల్వలను ఉంచినట్లు తెలుస్తోంది.

ఐటీ సోదాల్లో బిల్లులు లేని బంగారు సీజ్?

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని బంగారు దుకాణాల్లో ఐటీ అధికారులు జరుపుతున్న సోదాల్లో రూ. 2 కోట్ల మేర నగదు, సుమారు 300 కేజీలుపైగా బిల్లులు లేని బంగారును సీజ్ చేశారనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే ఐటీ అధికారులు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఇదిలా ఉండగా ప్రొద్దుటూరులోని ఒక బంగారు వ్యాపారి నుంచి శనివారం కస్టమ్స్ అధికారులు ఏడు బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఒక వ్యక్తి నుంచి శుక్రవారం పెద్ద మొత్తంలో బంగారును కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో ప్రొద్దుటూరులోని వ్యాపారి నుంచి బంగారు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

వేములలో యాత్ర- 2 సినిమా షూటింగ్

వేముల : మండల కేంద్రమైన వేములలో శనివారం యాత్ర-2 సినిమా షూటింగ్ ప్రారంభమైంది. హీరో జీవా పురవీధులలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచార సన్నివేశాలను చిత్రీకరించారు.

చదువుతోనే ఉజ్వల భవిత


శాంతినగర్‌లో విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, తల్లితండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. రెండోరోజు శనివారం కూడా కడపలోని వైఎస్సార్ కాలనీ, శాంతినగర్, బీడీకాలనీల్లో బడిబయట పిల్లలను బడిలో చేర్పించే విషయమై డీఈఓ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా బడిమానేసిన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి తల్లితండ్రులతో చర్చించి పిల్లలను బడిలో చేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చిందన్నారు. పిల్లల కోసం మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, చిక్కీలు ఇలా పలు రకాల పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కావున తల్లితండ్రులు తమ పిల్లలను బడి మాన్పించవద్దన్నారు. ఈ విషయమై డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు సమిష్టిగా పనిచేయాలన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి కడపలోని సాయిపేట, బళ్లారిరోడ్డులలో, ఎంఈఓ పాలెం నారాయణ ఆలంఖాన్‌పల్లి ప్రాంతంలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ ఏఎల్‌ఎస్ దశరథరామిరెడ్డి, ఏపీఎన్ స్కూల్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ టోర్నీలో 'అనంత'కు అగ్రస్థానం

- నెల్లూరు, చిత్తూరు జట్లు విజయం
- ముగిసిన అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పాయింట్ల పట్టికలో 7 పాయింట్లతో అనంతపురం జట్టు అగ్రస్థానంలో నిలువగా, 6 పాయింట్లతో చిత్తూరు రెండోస్థానం, 4 పాయింట్లతో నెల్లూరు మూడోస్థానంలో నిలిచాయి. శనివారం చివరిరోజు కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 176 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 46.5 ఓవర్లలో 202 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి. సుబ్రమణ్యం 64 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు కనిష్ 5, ఇస్మాయిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 36.3 ఓవర్లలో 188 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 67 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు అఖిల్ 8 వికెట్లు, సుబ్రమణ్యం 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 103 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 303 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 214 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

చిత్తూరు జట్టుకు విజయం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో 387 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 55.1 ఓవర్లలో 484 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 99 పరుగులు, లోహిత్ 75 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఆసిఫ్ హుస్సేన్ 4, ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 55.1 ఓవర్లలో 216 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శివకేశవరాయల్ 102 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు రెడ్డిప్రకాష్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 4.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా విజయానికి అవసరమైన 29 పరుగులు చేసింది. లోహిత్ 19 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కడప 296 పరుగులు చేయగా, చిత్తూరు జట్టు 484 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

నడిరోడ్డుపై ఆగిన లారీ.. స్తంభించిన ట్రాఫిక్


అంగళ్లులో హైవేపై నడిరోడ్డున ఆగిన హెవీ లారీ


రెండు కిలోమీటర్ల మేర ఆగిన వాహనాలు

- జాతీయ రహదారిపై మూడన్నర గంటల పాటు సతమతం
- మూడు రోడ్ల పొడవునా రెండు కిలోమీటర్లు ట్రాఫిక్ జామ్
- జేసీబీతో ఎట్టకేలకు లారీ పక్కకు తొలగింపు

కురబలకోట : ముంబై-చెన్నై (ఎంబీటీ) హైవే మార్గంలో అంగళ్లులో నడి రోడ్డుపై భారీ లారీ ఉన్నట్టుండి ఆగిపోవడంతో శనివారం ఆ మార్గంలో మూడు రోడ్ల పొడవునా రెండు కిలోమీటర్ల మేర వందలాది వాహనాలు ఆగిపోయాయి. వివరాలిలా.. మహారాష్ట్ర నుంచి మదనపల్లెకు సోయాబీన్స్ లోడుతో వస్తున్న భారీ లారీ కురబలకోట మండలంలోని అంగళ్లు కూడలి వద్ద ఎస్‌బీఐ ముందు సాంకేతిక లోపంతో ఉన్నట్టుండి ఆగిపోయింది. దీంతో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు వందలాది వాహనాలు ఆగిపోయి, ప్రయాణికులు సతమతమయ్యారు. ఆగిన లారీ పక్కగా మెల్లగా వన్‌వేలో వాహనాలను పంపినా హైవే కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. అనంతపురం, కడప, మదనపల్లె, మరోవైపు సీటీఎం రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మూడు రోడ్ల పొడవునా బారులు తీరి వాహనాలు ఆగిపోయాయి. అప్పటికీ ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ముదివేడు పోలీసులు విశ్వ ప్రయత్నం చేశారు. చివరకు గుణకుంట్లవారిపల్లె కృష్ణమూర్తికి చెందిన జేసీబీని తెప్పించి రోడ్డుపై ఆగిన హెవీ లారీని పక్కకు తొలగించారు. దీంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అంగళ్లు ట్రాఫిక్ విషయంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.